# నీటిమబ్బు నీడలో...

కిటికీ దగ్గర సీటు దొరికింది. ఇంకేం. చిన్న పిల్లవాడైపోతాడు ప్రభాకరం. 'విద్యా బోధనలో విశ్వసోదర భావం' అన్న శీర్షికతో సాగుతున్న ఉపన్యాసాల్లో రెండవ రోజు ఉపన్యసించడానికి కలకత్తా వెళ్తున్నాడు అతనిలోని ఉత్సాహమంతా కేవలం కలకత్తా వెళ్తున్నందుకుకాదు. ఆ తర్వాత వారం రోజుల సెలవుమీద వెళ్ళి న్యూ జల్‌పాయ్‌గురిలో, చాలా రోజుల తర్వాత స్నేహితుడు నరసింగ్ నాయక్‌ను కలుసుకుంటున్నందుకు. రైలు వేగం పుంజుకుని పరిణామశీలమైన జీవితంలా పరుగుతీస్తోంది. ఆ పరుగులో ఒక లయా, ఒక సంగీతం. వాగులూ వంతెనలూ వచ్చినప్పుడు ఆ లయలో వింత వింత మార్పులు. రైలు చేస్తున్న శబ్దాన్ని శ్రుతిగా చేసుకుని ఏదో పాడుకుంటున్నాడు. ఏదో ఆలోచిస్తున్నాడు. సృష్టిలో ఎంతకీ అర్థం కానివాడు మానవుడే-అనుకున్నాడు. సాంకేతిక విజ్ఞానంతో దూరాన్ని జయించి మనుష్యులంతా ఒకటే అంటాడు మరో వంక ఆధిక్యత కోసం అణ్వస్త్రాలు పెంచి యుద్ధభయం కల్గించి ఏదో పేరిట మనిషినీ మనిషినీ వేరు చేస్తాడు. టెలిఫోన్ స్తంభాలు రివ్వున వెనక్కు పోతూ ఉంటే వాటి మధ్య తీగలు పైపైకి లేస్తూ క్రిందకు అణిగిపోతూ కంటికి వింత భ్రాంతిని కలిగిస్తున్నాయి. చిన్న తనంలో ఈ వింతను

చూడ్డానికే కిటికీ దగ్గర సీటు కోసం పేచీ పెట్టేవాడు. సూర్యుడు కుంకుమ రంగులోకి మారి మెల్లగా అస్తమిస్తూ వుంటే రఘునాథపురం లోని సైన్స్ మాష్టారు జ్ఞాపకం వచ్చారు. "నిజానికి సూర్యుడు అస్త మించడం అంటే అది ఒక అర్ధగోళంలో వున్న ప్రజలకే పరిమితం. సూర్యుడు ఇంకో అర్ధ గోళంలో ఉదయిస్తున్నాడు" అని చమత్కారంగా చెప్పి గ్లోబ్‌ను తిప్పుతూ ఎదురుగా వెలుగుతున్న కొవ్వొత్తిని ఉంచి ఓపికతో పాఠం చెప్పేవారు రఘునాథపురం జ్ఞాపకం రాగానే కృష్ణవేణక్క మనసులో మెదిలింది. చీకట్లు ముసురుకుంటూ ఉంటే కిటికీలోంచి చూడడం మాని అంతర్ముఖంగా గతాన్ని నెమరువేసు కున్నాడు ప్రభ.

కొక్కొరోకో అని బలంగా కూసింది ఎదురుగా వున్న సోడా కొట్టు వాళ్ళ కోడిపుంజు, ఒక్క క్షణం ఆగి దూరంగా ఇంకో కోడి సమాధానం ఇచ్చింది. అవి తననే లేపినట్లు లేచి కూర్చున్నాడు ప్రభ. "ఇంకాస్త సేపు పడుకో. ఎక్కడి సామాన్లు అక్కడే వున్నాయి. కొత్త ఊరూ కొత్త ఇల్లూ, కాస్త సర్దుకోవాలి. మా కాళ్ళకి అడ్డం పడకు" అని విసుక్కుంది తల్లి కాంతమ్మ.

"ఏమిటే ఈ కోళ్ళూ కొంగలూ. ఇంతకన్నా మంచి వీధీ, పొరుగూ దొరకలేదా మీ ఆయనకు" అని సణుగుతోంది పెద్ద దిక్కుగా వచ్చి పది రోజులపాటు ఉండి, వెళ్ళిపోవలసిన కాంతమ్మ మేనత్త. "ఆయనక్కావలసింది కాస్త విశాలమైన పెంకుటిల్లు. అది దొరికింది. నోరు మంచైతే ఊరు మంచన్నారు" అని ముసలావిడ నోటికి తాళం వెయ్యాలనుకుంది కాంతమ్మ. 'సరేలే, అందరిదీ ఒక దారైతే మీ ఆయనదొక దారి' అంటూ సాగతీస్తూనే ఉంది ఇంకా ముసలావిడ.

పాల గ్లాసు ఖాళీచేసి వీధి అరుగుమీద కూర్చుని చుట్టూ వున్న కొత్త ప్రపంచాన్ని చూస్తున్న ప్రభకు తనవేపే చూస్తున్న రెండు కాటుక కళ్ళు కనిపించాయి. ఆ కళ్ళలో ప్రేమ వుంది. పిలుపుంది. స్నేహాన్ని వెతుక్కుంటున్న ప్రభాకరం అలా వెళ్ళి ఎదురింటి వీధి గడప దగ్గర నిల్చున్నాడు. కృష్ణవేణి ఎదురొచ్చి లోనికి తీసుకువెళ్ళింది. ఆమె ఒడిలో కూర్చుని, ఆమె వేరుశెనగ పప్పు అందిస్తూ ఉంటే తింటున్నాడు. ఆ ఇంటికి ఏదో కొత్త కళ వచ్చినట్లుంది. కృష్ణవేణికి మొదటి కానుపు దక్కలేదు. తరువాత కానుపుకు ఆశ పెట్టుకోవద్దని, వైద్యులు ఆమె తండ్రి వెంకటయ్యతో మెల్లగా చెప్పారు. ఆ బాధ మనసులో దాచుకుని తల్లిలేని సంతానాన్ని చూసుకుంటున్నాడు వార్ధక్యంలో. ఇప్పుడు తాత్కాలికంగా చూస్తున్న తియ్యని దృశ్యం వెంకటయ్యకు కాస్త ఊరట కల్గించింది.

"ఎవ్వరే కృష్ణా?" అని తండ్రి అడిగితే 'ఎదురింట్లో కొత్తగా దిగిన వాళ్ళ పిల్లడు' అని సమాధానం చెప్పింది. కృష్ణమ్మకు ఇద్దరు అన్నలూ, ఒక తమ్ముడూ. అన్నలిద్దరూ బంధువుల పొలాన్ని కౌలుకి తీసుకుని వ్యవసాయం చేస్తారు. పదిహేనేళ్ళ తమ్ముడు శీను థర్డ్ ఫారమ్‌దాకా చదివి మానేశాడు. సిలండరు తెచ్చి సోడాబుడ్లు పెట్టి వ్యాపారం చేస్తాడు. కృష్ణను ఆమె మేనమామకే ఇచ్చారు. అతనూ వీళ్ళతో వుండి వ్యవసాయంలో సాయం చేస్తూ వుంటాడు.

తల్లి కేక విని కృష్ణమ్మ ఒడిలోంచి వీధిలోకి పరుగు తీశాడు ప్రభ. "అడ్డమైన కొంపలూ పట్టి తిరిగితే వీడు పాడైపోతాడే పిల్లా." అని అరుస్తోంది ముసలావిడ. "ఒక్క పదిరోజులు ఓపిక పడితే వాణ్ణి స్కూల్లో వేస్తాను. ఈలోగా ఆ పసి వెధవని అలా కట్టడిచేసి చంపకండి పాపం. వాడితో ఆడే ఈడైన వాళ్ళు ఇక్కడ ఎవ్వరూ

లేరు కూడా" అని ప్రభ తండ్రి విసుక్కునేదాకా ఆమె నోరు మూత పడలేదు. ఆవిడ వారం రోజుల తర్వాత ఊరికి పోయేదాకా కాంత మ్మకూ ప్రభకూ మనశ్శాంతి చిక్కలేదు. తండ్రి ఆఫీసుకు పోతే, తల్లి ఇంటి పనిలో మునిగిపోతుంది. ప్రభ ఎదురింట్లో ఉన్న విశాల మైన పెరడులో ఆడుకుంటాడు. వీధి బడిలో చిన్నప్పుడు మూడవ క్లాసుదాకా చదువుకున్న కృష్ణమ్మకు ఇప్పుడు చిన్నారి శిష్యుడు దొరి కాడు. వాడు రోజూ వేసే లక్ష ప్రశ్నలకూ, యక్ష ప్రశ్నలకూ శాంతంగా సమాధానాలు చెప్పడం, పగిలిన సోడా బుడ్లలోని గోళీ కాయలు దాచి ఆడుకుందుకు ఇవ్వడం, చిన్న చిన్న కథలు చెప్పడంతో ఉత్సాహంగా కాలక్షేపం అయిపోతోంది. తరువాత కొన్నాళ్ళకు ప్రభను స్కూల్లో వేసినా ఈ స్నేహానికి పెద్ద అంతరాయం కలగలేదు. కృష్ణమ్మా వాళ్ళ ఇంట్లోంచి పెరట్లోకి వెళితే ఇంకో వీధి. అందులోంచి వెళితే స్కూలుకి అడ్డుదారి ఉంది. చుట్టూ తిరిగి వెళ్ళకుండా ఇలా స్కూలుకి వెళ్ళడం రావడంలో ఒక మజిలీ కృష్ణ ఇంట్లో తప్పదు. ఆ రోజు వింతలూ, విశేషాలూ విశాలమైన కళ్ళు తిప్పుకుంటూ చెప్తాడు ప్రభ. తను వస్తాడని ప్రత్యేకంగా కృష్ణమ్మ దాచి ఇచ్చిన సపోటా పండో జాంపండో తింటూ ఇంటికి వెళ్తాడు. ఒక సాయంత్రం ప్రభా కరం చెప్పిన ముచ్చటకు నవ్వలేక ఎంతో శ్రమపడిపోయింది కృష్ణ. "మా క్లాసులో సిద్ధాంతి ఉన్నాడు తెలుసా? నన్ను వాళ్ళ ఇంటికి పిల్చాడు. వాడి పెద్దన్నకు బుల్లి పాప పుట్టిందట. చిన్న నోరూ, చిన్ని చిన్ని పాదాలూ ఉన్నాయి. కేర్ కేర్ మని ఏడుస్తుంది. వెళ్ళి చూశాను. అదేంటీ, మీ అన్నకు పాప పుట్టిందన్నావు. మరి మంచం మీద పాప పక్కన ఇంకెవరో పడుకుంది అని అడిగాను. అదికాదు- మా వదినకే పాప పుట్టింది కానీ మా అమ్మా, తాతా, మామ్మా అంతా

మా అన్నకి పాప పుట్టిందనే అంటారు. ఎందుకో?" అన్నాడు వాడు. "పిల్లలు ఆడవాళ్ళకే పుడతారా? అక్కా" అని అడిగాడు ఇంకో రోజు ఎక్కడెక్కడో ఆడుకునివచ్చి కృష్ణమ్మ పెరటి గుమ్మంలో పడిపోయాడు. నుదుటిమీద దెబ్బతగిలి రక్తం చిమ్మింది కృష్ణమ్మ ఆ గాయాన్ని గుడ్డతో తుడిచి సున్నం బెల్లంకలిపి పట్టువేసింది. కృష్ణమ్మ కళ్ళలో నీళ్ళుచూసి "నాకు దెబ్బతగుల్తే నువ్వెందుకు ఏడుస్తావ్. నేను పడిపోతే మా అమ్మ నన్ను కొడుతుంది" అన్నాడు. "నువ్వు ఊరు ఊరంతా తిరిగి ఆడుకుంటావ్ మా వాకిట్లోకివచ్చి పడిపోతావ్ మీ అమ్మానాయినా చూస్తే ఏం అనుకుంటారు?" అని కళ్ళు తుడుచుకుంది కృష్ణ. పసివాడికి ఈ మాటలు ఎంత అర్థమైనాయో తెలియదు కానీ కృష్ణక్కకు తనంటే ఎంతో ఇష్టం అనిమాత్రం తెలిసింది. ఈ ఇద్దర్నీ చూస్తూ తృప్తిగా చుట్ట కాల్చుకుంటాడు వెంకటయ్య. ఎప్పుడైనా ప్రభ పుస్తకాలు నలిగి చిరిగి ఉంటే సరిచేసి బైండ్ చేస్తాడు. గోళ్ళు పెద్దగా పెరిగి నల్లటిమట్టి చేరిఉంటే తన తాళాలగుత్తిలోని ఒక తాళంచెవికొనకు సానపెట్టి దానితో ఎంతో నేర్పుగా గోళ్ళు తీస్తాడు వెంకటయ్య. కట దీపావళిముందు పదిరోజులపాటు ప్రభాకరం తల్లితో తాతగారి ఊరు వెళ్ళి చవితి వెళ్ళాక రెండురోజులకు తిరిగి వచ్చాడు రోజూ ఇంట్లో తిరుగాడే పిల్లడు కనుపించకపోతే కృష్ణకూ వెంకటయ్యకూ ఎంతో వెల్తి. ఏదో అసంతృప్తి. ఏమీ తోచలేదు. తిరిగివచ్చిన మర్నాడే ఒకముచ్చట చెప్పి ప్రభ ఇంటందర్నీ నవ్వించాడు. పదిరోజులపాటు ఊర్లోలేడు. జరిగిన పాఠాల్ని చదవనేలేదు. క్లాసులో ముందరోజు జరిగిన పాఠం లోంచి ప్రశ్నలువేసి పిల్లల్ని జవాబులు చెప్పమంటున్నారట వాళ్ళ టీచరు. హెడ్‌మాష్టరుగారు అదే సమయంలో వరండాలో నిలబడిజరుగుతున్న పాఠాన్ని వింటున్నారు, పాముతినే ఆహారం ఏమిటి? అని టీచర్ అడిగితే—చిమ్మిలీ, చలిమిడీ, పాలూ అని ప్రభ సమాధానం

చెప్పారట. క్లాసు టీచరూ, పాఠం చెప్పగా వింటున్న హెడ్‌మాష్టరూ కూడా పగలబడినవ్వి ఇకనుంచీ జరిగిన పాఠం చదువుకుని రావాలని మందలించారట. ఈ ముచ్చటవింటూ సోడాబుడ్లు కడుగుతున్న శీను నవ్వలేక నేలమీద పడుకుండిపోయాడు. తరువాత తేరుకుని "నాగుల చవితికి వాళ్ళ అమ్మతో పుట్టదగ్గరకి వెళ్ళినట్లున్నాడే అక్కా" అని అన్నాడు. ఎప్పుడైనా అమ్మనడిగి ప్రభాకరం పొలాలమీదకు వెళ్తాడు. శీను అన్నలూ, మామా వ్యవసాయం చేస్తూఉంటే చూసివస్తూ ఉంటాడు. ఇలాగ దట్టంగా పెరిగి పెనవేసుకుపోతున్న మైత్రీబంధంతో తరుచూ ఒక ఇబ్బందిని ఎదుర్కోవలసి వచ్చేది కృష్ణమ్మ. ఘుమఘుమలాడే కోడికూర వండినపుడు తనకీ పెట్టమనేవాడు ప్రభ. ఏదో మాటల్లో మరిపించి తినడానికి పండోకాయో ఇచ్చి సమస్యను పక్కకునెట్టేది. కానీ క్రమంగా పెద్దవాడౌతున్న ప్రభను మరిపించడం సులభం కాలేదు. "తింటూ ఉంటే నోరుతెరిచి అడుగుతావు. ఇవ్వకుంటే నాకు తినబుద్ధి కాదు. ఇస్తే పాపం. ఇవ్వకుంటే పాపం. ఎలా నీతో —" అని చేతి వేళ్ళతో నుదుటిమీద కొట్టుకునేది. ఒకరోజు ప్రభ పేచీపెట్టాడు ఇచ్చినా పాపమే. ఇవ్వకున్నా పాపమే ఇవ్వకుంటేనే ఎక్కువపాపం అనుకుందో ఏమో ఎక్కువ కారం వెయ్యకుండా ప్లేట్లోతీసిన కూర ప్రభ ముందు ఉంచింది. ఎంతో ఇష్టంగా తింటూ "మా అమ్మ ఎందుకు చెయ్యదో ఈ కూర" అన్నాడు. "ఈ మాటే మీ అమ్మతో అన్నావో మళ్ళా మాగడప తొక్కనివ్వదు" అని కళ్ళు తుడుచుకుంది. "మనం ఎవరింట్లోపుడతామో మనచేతిలో ఉందా. ఏ ఇంటపుడితే అక్కడ పెరుగుతాం. నాయనా, అమ్మ తాతా బామ్మా ఎలాతింటే మనం అలా ఉంటాం. పెద్దయినాక అలా ఉండటానికే ఇష్టపడతాం అంతే" అంది. ఈ స్నేహాన్ని వదలు కోలేని ప్రభ ఇలాంటి ప్రస్తావన తన తల్లిముందు ప్రత్యేకంగా ఎన్నడూ తీసుకుని రాలేదు.

వయసుతోపాటు స్కూల్లో పాఠాలూ బాధ్యతలూ పెరుగుతున్నాయి. తనచుట్టూ ప్రతీ సంఘటనకూ విచిత్రంగా స్పందిస్తాడుప్రభ. లెక్క సరిగ్గా అర్థం చేసుకోలేకపోయినా, హోంవర్కు చేసుకురాలేకపోయినా అసహనంతో తిట్టి అవమానపరచి బెంచీమీద నిలబెట్టే శంకర్రావు టీచర్ అంటే ప్రభకు భయం, రోతా కలిగేవి. అతని దగ్గర ప్రైవేటుచదివే నలుగురైదుగురు స్టూడెంట్స్‌ని మొదటిబెంచీలో కూర్చోమని పాఠం చెప్తాడు. ఏదైనా ప్రశ్నవేసి ఎవ్వరూ చెప్పకుంటే మొదటి బెంచీవాళ్ళని అడిగి ఆ ప్రశ్నకు సమాధానం రాబట్టుకుని గర్వంగా క్లాసునంతా కలయచూస్తాడు. "అలా చదవాలి" అనిమిగతా అందరివేపూ ఎగతాళిగా చూస్తాడు. స్వేచ్ఛగా సందేహాలుఉంటే అడిగే చనువుమిగతా పిల్లలకు ఇచ్చేవాడు కాదు. అందుకే అందరికీ మొదటిబెంచీ వాళ్ళమీద కూడా ఒక విచిత్రమైన ఈర్ష్యపెరిగి మిగతాపిల్లలు ఒకటీ – ఆ మొదటి బెంచీపిల్లలు ఒకటీ అన్న భేదభావం బలంగా ఏర్పడిపోయింది. పిల్లలు ఒక్కొక్కక్లాసు పాసయి పైక్లాసులకు వెళ్ళినా మొదటిబెంచీ పిల్లలంతా ఒకటిగా, మొదటిబెంచీలోనే కూర్చోడం ఆనవాయితీగా పరిణమించింది. ఈ ఏర్పాటు అలవాటైపోయి ఎవ్వరూ అంతగా పట్టించుకోకపోయినా-- ఒక విచిత్రమైన సంఘటన అందర్నీ కలవరపెట్టింది.

కొత్తగా వచ్చిన సైన్స్‌మాష్టారు ఒకరోజు క్లాసులోకి వచ్చేసరికి చిన్నఘర్షణ మొదటి బెంచీ దగ్గర జరుగుతోంది. కలీముల్లా అన్న అబ్బాయి కొత్తగా క్లాసులోచేరాడు. మొదటిబెంచీలో ఖాళీఉంటే వచ్చి కూర్చున్నాడు. కాస్త ఆలశ్యంగా వచ్చిన నర్సింహం "ఆ సీటు నాదీ" అన్నాడు. సైన్స్‌మాష్టారు కలగజేసుకుని "కూర్చున్నవాణ్ణి లేపడం దేనికి. నువ్వు ఆ మూడోబెంచీలో ఖాళీఉందిగా. పోయికూర్చో. క్లాసులో కూర్చునే స్థలానికి వారసత్వం హక్కులుండవు" అన్నారు.

నరసింహం ఏడుపు ముఖంపెట్టి గోపాలయ్య పక్కన కూర్చు నేందుకు సందేహిస్తున్నాడు. మాష్టారు కూర్చోమని గట్టిగా చెప్తున్నారు. ఈ సందిగ్ధపరిస్థితిలో గోవిందరాజులు అసలు విషయం స్పష్టంగా మాస్టారుకి చెప్పేశాడు. "నరసింహం గోపాలయ్యా మా వీధిలోనే ఉంటారండీ ఇద్దరూ గోళీకాయలు ఆడుకుంటూ ఉంటే నరసింహం నాయనచూసి పిల్చి చావగొట్టేశాడు" అన్నాడు. మాస్టారు కుతూహలంగా "ఎందుకూ?" అని అడిగారు. లౌక్యం, దాపరికం ఇంకా తెలియని నరసింహం భోరున ఏడుస్తూ "నీసు తిన్నవాళ్ళతో ఆడు కుంటే తోలువలిచేస్తా నన్నాడండీ మా నాయన" అని తండ్రికొట్టిన దెబ్బలను తల్చుకున్నాడు. అందరూ నవ్వినా. మాష్టరుగారు గంభీరంగా ఆలోచిస్తూ చూసిన చూపుకు పిల్లలంతా మళ్ళీ మాటలాడకుండా సర్దు కున్నారు. "వెన్నలాంటి పసిహృదయాల్లో ఇలా గే విషబీజాలు నాటేస్తున్నారు పెద్దలు" అని నిట్టూరుస్తూ కుర్చీలో కూర్చున్నారు మాస్టారు. ఆరోజు పుస్తకంలో పాఠం ఏది జరగలేదు. కానీ మాస్టారు చెప్పిన మాటలు పిల్లల్నందర్నీ ఆలోచించేలా చేశాయి.

"మనిషి దూరాన్ని జయించేశాడు. ఇప్పుడు ఇన్ని సౌకర్యాలు వచ్చాయి — కానీ మొదట్లో సముద్రాలూ మంచుకొండలూ దట్టమైన అడవులూ మనిషినీ మనిషినీ వేరుచేశాయి. గుంపులు గుంపులుగా ఏ ప్రాంతంలో బతికినవాళ్ళు ఆ వేడికీ, చలికీ, మంచుకీ, దొరికే ఆహారానికీ అనువుగా జీవితం మల్చుకున్నారు. సంప్రదాయం మీద మనిషికి ఉండే వ్యామోహంవల్లా ఇప్పటికీ ఆ అలవాట్లూ కట్టుబాట్లూ మనల్ని శాసిస్తూనే ఉంటున్నాయి. ఎడారిలో చాలాకాలం జీవించినవాడు నదీతీరాల దగ్గరకు వచ్చినా మంచినీటిని బంగారంలాగ పొదుపుగా వాడతాడు. ఇసుకతో గిన్నెలు శుభ్రం చేసుకుంటూ ఉంటాడు. ధృవాల్లోనూ మంచుప్రదేశా

ల్లోన్నూ వేటాడి జీవించేవాడు కాయాపండూ దొరికే వనాల్లోకి వచ్చినా మాంసాహారం మీద ఇష్టం చూపుతూ ఉంటాడు. ఉష్ణ మండలంలో ఉన్నవాళ్ళు మంచుప్రదేశాల్లో బ్రతికేవాళ్ళని రోజూ రెండుపూట్లా స్నానం చెయ్యరని ఆక్షేపిస్తారు అసలు మీ అందరికీ ఆంత్రోపాలజీ, సోషియాలజీ చిన్నతనం నుండీ కాసింత కాసింతగా చెప్పాలి. ప్రతీ సంప్రదాయం, జీవిత విధానం వెనుకా కొంత పరిసరాల ఒత్తిడీ, కొంత చరిత్రా ఉంటుంది. అది అర్థం చేసుకుంటే ఈ భేద భావం మనిషికీ మనిషికీ మధ్యరాదు'' అన్నారు. ఆ రోజునుండీ క్లాసులో మొదటి బెంచీమీద వారసత్వం హక్కులు నశించిపోయాయి ఏ క్లాసు ఎగ్గొట్టినా పిల్లలంతా కొత్తగా వచ్చిన సైన్స్‌మాస్టారి క్లాసు పొరపాటున కూడా మానరు. ఏ ప్రశ్న వేసినా మాస్టారుకూడా కోపగించుకుంటారన్న భయంలేదు. అన్నిటికీ నవ్వుతూ చమత్కారంగా సమాధానాలు చెప్పి సమయానుకూలంగా కథలూ చరిత్రలోని సంఘటనలు చెప్పేవారు.

సైన్సూ జియోగ్రఫీలోని పాఠాలే కాక సందర్భంవస్తే తెలుగు పద్యాలు శ్రావ్యంగా చదివేవారు. మనిషి మేధస్సును పెంచుకుంటున్నం తగా హృదయాన్ని పెంచుకోలేక పోతున్నాడనే వారు తరుచూ. పిల్ల లందరికీ చదువంటే దీక్షా ఉత్సాహం పెరిగి సైన్సుమాస్టార్ని ఎక్కువ గౌరవించేవారు. ఏమీ చదువుకోకపోయినా కృష్ణవేణక్క సైన్సు మాష్టరుగారిలాగే కొన్నికొన్ని విషయాలు మాట్లాడటం ప్రభకు అప్పు డప్పుడు ఎంతో ఆశ్చర్యం కల్గించేది.

స్కూల్లో చిత్తుకాగితాల్ని పిల్లలు చిందరవందరగా పోసేవాళ్ళు. హెడ్‌మాస్టారు గారు ఏన్నోసార్లు సర్క్యులర్లు పంపి మాన్పించాలను కున్నారు. ఏమీ ఫలితం కనబడలేదు. అలాంటిది సైన్సుమాస్టారు వచ్చాక స్కూలు శుభ్రంగా ఉంటోంది. మాస్టారి దగ్గర చేతికర్ర

ఉండేది. దానికి అడుగున కాస్త సూదిమొనలా ఉండేది. ఆయన వెళ్ళే దారిలో చిత్తుకాగితం కనిపిస్తే ఆ కర్రతో గుచ్చి అందుకుని చెట్లకు కట్టిన చెత్తబుట్టలో వేసి తనదారిని వెళ్ళిపోయేవారు. ఇలా ఎక్కువగా పాఠం చెప్పినట్లు చెప్పకుండా తన ప్రవర్తనతోనే స్కూల్లో చాలా మంచి మార్పు సాధించగలిగారు.

ఇంగ్లీషు మాస్టారు వారంరోజులు శలవు పెట్టినప్పుడు దేశభక్తి అన్న ఇంగ్లీషు పాఠం ఒకమారు సైన్స్‌మాస్టారు చెప్పవలసివచ్చింది. ఒక చిన్న విషయంచెప్పి అందర్నీ నవ్వించారు "విక్టోరియా మహారాణి చార్లెస్ డికెన్స్‌కి జేబుగడియారం బంగారంది బహూకరించిందట. అది జేబులో పెట్టుకొని పారిస్‌లో ఒక థియేటర్‌కి వెళ్ళారట. తిరిగి వస్తున్నప్పుడు వాచీ చూచుకుంటే జేబులో కనపడలేదట. ఎంతో విచారించి తన బసకువచ్చి తలుపుతీస్తూ ఉంటే అక్కడ ఒక పార్శిల్ ఉందట. దానికి ఒక చిన్న చీటీకూడా తగిలించి ఉందిట.

'నా వృత్తిరీత్యా రోజూ ఎందరినో చూస్తూ ఉంటాను. కానీ నేను ఇవాళ నడుపుతున్న వ్యవహారం నా స్వదేశీయుడితోనే అని మీ గడియారం వెనుక చదువుకున్నాక తెల్సి నా పొరపాటుకు చింతిస్తూ తిరిగి సమర్పించుకుంటున్నాను' అని వ్రాసి పిక్‌పాకెట్ అని సంతకం చేసిన చీటీని చూసి డికెన్స్ ఎంతగానో నవ్వుకున్నాడట. సరిగ్గా అర్థం చేసుకోని దేశభక్తి ఇలా దురభిమానం నేర్పుతుంది. సంపూర్ణ జ్ఞానిగా ఎదిగే పరిణామంలో దేశభక్తి ఒక మజిలీ. ఒక మెట్టు. అలా తెల్సుకున్న దేశభక్తులే ప్రపంచంలో ప్రేమా శాంతీ నిలుపగలుగుతారు. 'దేశమంటే మట్టికాదోయ్' అని ఎప్పుడో పాడిన గురజాడ ఎంత అభ్యుదయవాదో ఆలోచించండి" అన్నారు సైన్స్‌మాస్టారు. ఇలా రఘునాథపురంలో గడిపిన మధురక్షణాలు తలచుకుంటున్నాడు ప్రభ. వెంక

టయ్యి గుండెపోటుతో చనిపోయాక కృష్ణవేణీ వాళ్ళు వ్యవసాయం మానుకుని ఏదో గ్రామానికి తరలిపోయారు. ప్రభాకరం కూడా పై చదువులకోసం రఘునాథపురం విడిచిపెట్టవలసి వచ్చింది. అయినా కృష్ణవేణక్క తరుచూ తన ఆలోచనల్లోకి వస్తూ ఉంటుంది.

కలకత్తాలో ఉపన్యాసం అయిన మరునాడే బయలుదేరి న్యూజల్ పాయ్‌గురి స్టేషన్‌లో అడుగుపెట్టిన ప్రభాకరాన్ని గుర్తించి మేజర్ నరసింగ్ నాయక్ ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు. "మన కాలేజీలో సంస్కృతం లెక్చరర్ ఒకమారు 'కావ్యాల్లో హిమాలయాలు' అన్న అంశంమీద ఉపన్యాసం ఇస్తే వింటూ మన ఇద్దరం హిమాలయాలు చూడాలని కలలు కన్నాం జ్ఞాపకం ఉందా? నేను ప్రస్తుతం హిమవంతుని భుజస్కంధాలమీదనే డ్యూటీ చేస్తున్నాను. అందుకే నిన్ను తప్పకుండా రమ్మని రాసి బలవంతం చేశాను" అన్నాడు.

తీస్తా బ్రిడ్జి దాటి రాత్రి పదిగంటలకు గాంగ్‌టాక్ చేరుకున్నారు స్నేహితులు ఇద్దరూ. ఉదయం లేచి వేడివేడి టీ తాగి అలా హెలీపాడ్ వరకూ వెళ్ళివచ్చారు. మంచుతెరల మాటున బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటున్నట్లు ఉన్న నగరాన్ని వింతగా చూస్తున్నాడు ప్రభ. చాలా దూరంగా పడుతున్న ఉదయకిరణాల వెలుగులో మెరిసిపడుతున్న కాంచనజంగా శిఖరాన్ని నాయక్ ప్రభకు చూపించాడు. ఆ తరువాత జోంగాలో బయలుదేరి చక్కని ఘాట్ రోడ్డు మీదుగా పర్వతాల్ని చుట్టుకుంటూ మధ్యాహ్నం రెండుగంటల వేళ దేశ సరిహద్దు రేఖ దగ్గిరకు చేరుకున్నారు. ఇద్దరు సైనికోద్యోగులు జోంగా దగ్గరకువచ్చి మేజర్ నాయక్‌కి సైనిక సంప్రదాయంతో వందనం చేశారు. నాయక్ వాళ్ళకి ప్రభాకరాన్ని పరిచయంచేసి, మంచులో తిరగడానికి ప్రత్యేక

మైన బూట్లు తెప్పించాడు. "నేను కాస్త ఆఫీసువని చూసుకుని వస్తాను. ఈలోగా ఈ బూట్లు వేసుకుని నెమ్మదిగా ఈ ప్రదేశం అంతా చూడు" అని దూరాన నిలబడి ఉన్న ఒక సైనికుణ్ణి పిలిచి ప్రభాకరానికి సహాయంగా వెంట పంపించాడు.

సుమారు పద్నాలుగువేల అడుగుల ఎత్తుమీద బరువైన బూట్లతో నడుస్తున్నా ప్రభాకరానికి తన శరీరం ఎంతో తేలికగా ఉన్నట్లు అనిపించింది. చుట్టూ ఉన్న పర్వతశ్రేణులూ, అగాధమైన లోయలూ, పైన పరచుకున్న ఆకాశం చూస్తూ ఉంటే అతని ఆలోచనలు కూడా వింతగా తేలికగా ఉన్నాయి. తనతో ఉన్న సైనికుణ్ణి చూస్తూ "పేరేమిటి?" అన్నాడు ప్రభ, మాటలు కలుపుతూ. వినయంగా "అజేయ్‌కుమార్ ఛేత్రీ" అన్నాడు అతను. "ప్రజలకూ ప్రపంచానికి దూరంగా ఈ కొండల్లో డ్యూటీ చేస్తూ ఉంటాం. మీలాంటి వాళ్ళు వస్తే మాకు చాలా సంతోషంగా ఉంటుంది"— తనకు తోచిన విధంగా స్నేహాన్ని ప్రకటిస్తూ ఇంకాస్త సంభాషణ పొడిగిస్తూ అన్నాడు. ఛేత్రీ హిందీలో మాట్లాడుతున్నా ప్రతీ శబ్దంలోనూ ఘూర్కాలీ యాస బాగా వినిపిస్తోంది. అతను ప్రభాకరానికి దగ్గరగా ఉన్న సరిహద్దురేఖను చూపిస్తూ ఉంటే రేఖకు అవతలవేపు కాస్త దూరంగాఉన్న విదేశీ సైనికుడు ఒకడు చేతితో ఏదో సౌజ్ఞలుచేస్తూ ఛేత్రీని పలుకరిస్తున్నాడు. ఛేత్రీ తలకదుపుతూ చేతులు ఊపాడు. ఈ దృశ్యం ప్రభాకరానికి కాస్త వింతగా తోచింది. "వాళ్ళకూ మీకూ స్నేహం—పరిచయం ఉంటుందా?" అని అడిగాడు. సమాధానంగా చిన్నగానవ్వి "నిత్యం ఎదురు ఎదురుగా జీవిస్తాం. ఒకళ్ళనొకళ్ళం చూస్తూ ఉంటాం. పరిచయం ఉండకుండా ఎలాగ. నా అధికారి తుపాకీ పేల్చమని ఆజ్ఞ ఇస్తే నేను పేలుస్తాను. వాడి అధికారి పేల్చమంటే వాడూ అంతే"

అన్నాడు—అతి సాధారణ విషయంలాగ తేలిగ్గా. బెర్ట్రెండ్ రస్సెల్ యుద్ధ వ్యతిరేకతను ప్రకటించి జైలుకు వెళ్ళడం జ్ఞాపకం వచ్చింది ప్రభాకరానికి ఎందుకో ఆ సమయంలో.

కుడిచేతివేపు దూరంగా వజ్రాలు తాపినట్లు మెరుస్తున్న మంచు శిఖరాన్ని చూపించి "దాని పేరేమిటి?" అన్నాడు ప్రభ. ''చుంబనారి." అంటూ ఏదో అస్పష్టంగా పేరుచెప్పి ''అది నేపాల్ పరిధిలో ఉంది" అన్నాడు. ప్రభ సాలోచనగా అతని ముఖంలోకి చూస్తూ ఉంటే నిర్మలంగా పసిపిల్లవాడిలా చిరునవ్వు నవ్వుతున్నాడు. కొన్ని క్షణాల క్రితం సరిహద్దుకి అవతల సైనికుడితో చేతులు ఊపుతూ ప్రతిస్పందించిన చైత్రీ ముఖంలోని నవ్వుకూ ఈ నవ్వుకూ ఏమీ తేడాలేదు. ప్రసన్నమైన ఆ ముఖంలో తాత్త్వికవికాసంతో ప్రకాశించే సైమ్సమాస్టారూ, అమాయకంగా తోటిమనిషిని ప్రేమించగల కృష్ణవేణక్కా లీలలా కనిపించారు.

భూమ్మీద మానవులు గీసుకున్న రేఖలతో ప్రమేయం లేనట్లు ఒక పెద్ద నీటి మబ్బు వచ్చి ఆ ప్రదేశాన్నంతా గాఢంగా కౌగలించుకుంది.